# రాజకీయాలు అర్థం కావు

**చి**త్రం ఏమిటంటే, చాలామంది ఉద్దేశాలు, రాజకీయాలు అర్థం కాకపోయినా ఆసక్తికరంగా ఉంటాయి, నైరూప్యచిత్రకళ లాగా. అలాంటి రాజకీయ ప్రియుల కోసం దిబ్బ రాజకీయాలను గురించి క్లుప్తంగా రాస్తున్నాను.

దిబ్బలో తొంభై ఒక్క పార్టీలు ఉన్నాయి. అందులో చాలాభాగం ఏదో ఒక కుగ్రామంలో మాత్రమే కనిపిస్తాయి. యావద్దిబ్బ పార్టీగా పరిగణించటానికి కనీసం ఇరవై గ్రామాలలో కార్యాలయాలు ఉండాలి. అటువంటివి కూడా పది పదిహేను పార్టీల దాకా ఉన్నాయి. అయితే వాటిలో రెండు, మూడు పార్టీలు కోటీశ్వరుల 'జేబు' పార్టీలనీ, ఆ కోటీశ్వరులు సొంత చమురుతో ఇరవైయేసి గ్రామాలలో కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నారనీ, వాటికి సభ్యులెవరూ లేరని చెప్పుకుంటారు. అయితే దిబ్బ సంప్రదాయం ప్రకారం చట్టబద్ధంగా చట్టోల్లంఘనం చెయ్యటం నేరం కాదు. కనక, ఆ కోటీశ్వరుల పార్టీలను యావద్దిబ్బ పార్టీలు కావని ఎవరైనా సాహసించి అంటే, వారు వెంటనే జైలుకు పంపబడతారు. రాజకీయాలా? మాటలా?

దిబ్బలో పచ్చపార్టీ, ఆకుపచ్చ పార్టీ, చిన్న పార్టీ, పెద్ద పార్టీ, దుక్క పార్టీ, బక్క పార్టీ, చెత్త పార్టీ, చెదారం పార్టీ ఉన్నాయి. ఎర్ర పార్టీ అంటూ ఉన్నది గాని అది రాజకీయ పార్టీ అని చెప్పటానికి లేదు. ఎందుకంటే దానికి కార్యాలయాలు లేవు. దాదాపు ప్రతి కుగ్రామంలోనూ దాని సభ్యులున్నారంటారు. కాని వాళ్లెవరో బయటికి రారు. ఎప్పుడన్నా పోలీసులు కారణాంతరాల వల్ల ఎవరినన్నా కాల్చి చంపితే, లేక 'నరక కూపాలలో' (పోలీసు కార్యాలయాలలో ఉండే రహస్య గదులలో) చిత్రహింస చేసి చేసి, అందుకు కారణాలు బయట పెట్టటం సభ్యత కానప్పుడు చచ్చినవారి శవాలను అడివిలో పారేసి - అడవుల సంరక్షణను పోలీసులు బలపరిచినంతగా దిబ్బలో ఇంకెవరూ బలపరచరట - వీళ్లు ఎర్ర పార్టీ వాళ్లనీ అడవిలో వేటాడి చంపామనీ చెబుతారు. అది అధికార వార్త. దిబ్బ పోలీసుల ఆగ్రహానికి గురి అయిన వారిని స్థూలంగా ఎర్రపార్టీ అనుకోవచ్చు. ఏమైనా ఎర్ర పార్టీకి మంత్రిత్వాలూ, శాసనసభలూ, ఎన్నికలూ వగైరాలతో పనిలేదు గనక, ఆ పార్టీ రాజకీయ రంగంలో లేనట్టే లెక్క. మాజీ దిబ్బ ప్రభువు, పదిహేను తరాల రాజరికానికి ఆఖరు వారసుడు, అన్నట్టు, ఎన్నికలు లేని రాజకీయాలేమిటి?

చిక్కేమిటంటే దిబ్బలో ఏ రాజకీయ పార్టీకి మెజారిటీ లేదు. అందుచేత మాట పరిపాలన అమలులో ఉంటుంది. ('మాట' అనే మాట చూసి అపోహ పడకండి). ఏనాడైనా దిబ్బను పాలించే అర్హత 'పెద్దకూటమి'కి ఉంటుంది. అది మెజారిటీ పార్టీ. ప్రతిపక్ష పార్టీలలో ముఖ్యమైనది చిన్నకూటమి. ఒక్కోసారి బుల్లి కూటమి, ఒంటెత్తు కూటమి వగైరాలు కూడా ఉంటాయి.

కూటములు స్థిరంగా ఉండవు. అందులో ఏ రోజు ఏయే పార్టీలుండేది చెప్పలేం. పచ్చపార్టీకీ, ఆకుపచ్చ పార్టీకీ పచ్చిగడ్డేస్తే భగ్గుమంటుంది. ఒక్కోసారి రెండూ పెద్ద కూటమిలో చేరిపోతాయి. అవి రెండూ కలిసినప్పుడల్లా దిబ్బ రాజకీయాలు రక్తి కడతాయి. ఏకమైన క్షణం నుంచీ ఒకదాన్ని ఒకటి కూటమినుంచి నెట్టెయ్యటానికి విశ్వప్రయత్నాలు సాగిస్తాయి. చివరకు ఏమవుతుందా అని జనాలలో గొప్ప సస్పెన్స్ పుట్టుకొచ్చేసి ఆ సమయంలో వరదలొచ్చి దిబ్బ మునిగిపోయినా, జనం ఇళ్ల కప్పులెక్కి రాజకీయాలు మాట్లాడుకుంటారు గాని వరదలను తలచరు. కనీసం దిబ్బ పత్రికలు చదివే వాళ్లకు అలాటి అభిప్రాయం కలుగుతుంది.

బై ఎలక్షన్ జరిగినప్పుడల్లా రాజకీయ తెప్ప తలకిందులు కావటానికి ప్రయత్నిస్తోంది. ఒక బక్క పార్టీవాడు ఎక్కడో కూటమి అభ్యర్థిని పడగొడ్తాడు. వెంటనే కూటమి నుంచి దుక్కపార్టీ బక్కపార్టీల వాళ్లు రాజీనామా ఇచ్చి బక్కపార్టీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటుచెయ్యడానికి మంతనాలు ఆరంభిస్తారు. వచ్చేపొయ్యే రాజకీయ సారథులతో దిబ్బ బస్సులూ, దిబ్బ రైళ్లూ కిటకిటలాడిపోతాయి. ఈ మంతనాల గురించి వెలువడే వార్తలు – నిజమైనా, అబద్ధమైనా – గొప్ప రాజకీయ సంచలనాన్ని కలిగిస్తాయి.

ఇలాగే ఒకసారి పెద్ద కూటమినుంచి చాలామంది సభ్యులు నిష్క్రమిస్తున్నారని చెప్పి, చిన్నకూటమిలో చేరుతున్నట్లు పత్రికలకు వార్త ఇచ్చారు. చిన్న కూటమి పెద్దకూటమిగా మారినట్లు స్పష్టమయింది. ఈ సందులో గోడమీది పిల్లి పార్టీగా వ్యవహరిస్తున్న బుల్లి కూటమి చిన్న కూటమితో చేరింది. చిన్న కూటమి అధికారంలోకి రావటం ఖాయమన్నారు. శాసనసభను సమావేశపరిచి పెద్ద కూటమి మీద విశ్వాసరాహిత్య తీర్మానం ప్రతిపాదించారు. శాసనసభ్యులు వోటు చెయ్యవచ్చే సరికి పెద్ద కూటమికి వ్యతిరేకంగా నలుగురే నలుగురు వోటు చేశారు.

ఏం జరిగింది? పత్రికలలో నెలరోజులపాటు ఊహాగానం అయిపోని పాటకచ్చేరీలాగా సాగింది. జనం ఆసక్తితో చదివి, తిండి, కరువూ, ఆకలిచావులూ కూడా పట్టించుకోలేదు.

ఇంతలో ఇంకో బై ఎలక్షన్ వచ్చింది. పెద్ద కూటమి అభ్యర్థికి డిపాజిట్టు పోయింది.

అప్పుడు పెద్ద కూటమి నుంచి దుక్క, బక్క, కుక్క, నక్క పార్టీల వాళ్లు భారీ ఎత్తున రాజీనామా ఇచ్చి...

ఇట్లా దిబ్బ రాజకీయాలను గురించి ఎంతో ఆసక్తికరమైన విషయాలు రోజులతరబడి చెప్పుకుపోవచ్చు. రాజకీయాలు అంటే ఆసక్తిలేని వారికి ఒకముక్కలో దిబ్బ రాజకీయాల సారం చెప్పవచ్చు.

దిబ్బలో ఏడేళ్లుగా రాజకీయాలున్నాయి గాని, పరిపాలన లేదు. దిబ్బ ప్రజలకు రాజకీయాలు కావాలి గాని, పరిపాలన అవసరం లేదన్న వదంతి ఒకటి ఉన్నది.

***ముద్రణ : ప్రభవ మాసపత్రిక, డిసెంబర్ 1978***